# ఎక్స్‌ప్లాయిటేషన్

శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి

ఉత్తంలాంటి వెంకట్రాముడు నీరసించి కళ్లల్లోకి ప్రాణాలు తెచ్చుకున్నాడు. వాణ్ణి చూసేప్పటికి గుండె గతుక్కుమంది. కూచొని తల వంచుకొని పెదిమలు తడుపుకుంటూ జేబులు తడుముకుంటున్నాడు. ఒక సిగరెట్టు అగ్గిపెట్టి చేతి కందించాక వెలిగించుకొని కొస్త స్థిమిత పడ్డాడు.

'ఏమిరా, ఎందుకు వదిలేశావ్ ఉద్యోగం?'

'డబ్బులేక—' వంచుకున్న ముఖం ఎత్తకుండానే చెప్పాడు.

మొన్న క్యాంపుమీద అక్కడికెళ్తే అంతా వెంకట్రాముణ్ణి ఏగేసి పోయాడన్నారు. ఒకళ్ళదగ్గర పదీ, మరొకరిదగ్గర యిరవై, ఇంకోళ్ళదగ్గర యాభై—యిలా అప్పులు చేశాడు. పెద్ద మొత్తాలు అలా ఉంచి, బేడా పావలాలుకూడా చేబదుళ్లు పుచ్చుకొన్నాడుట.

'ఛీ, బాధ్యతలు తెలిసిన వెంకట్రాముడుకూడా...' నాకు దగ్గిరిస్నేహితుడైనప్పటికీ వాళ్ళముందు వెంకట్రాముణ్ని ఆ మాత్రమైనా అనకుండా ఉండలేకపోయాను.

'ఏమొచ్చిందిరా, అంత పరిస్థితి!' అన్నాను.

'నీకు తెలియదుట్రా, అప్పుల పాలయ్యానని—' అని లోగొంతుకతో తాపీగా అన్నాడు వెంకట్రాముడు.

కొస్సేపాగి మొదలెట్టాడు:

'అప్పులపాలు కావడం నా హక్కనుకుంటున్నా నిప్పుడు...' నేను బొమలు ముడిచి వాడివంక చూశా. 'ఆఫీసులో ఒకడిదగ్గర చేబదుళ్లు పుచ్చుకోడం మొదలెట్టాను. అది ముదిరి పెద్ద అప్పులదాకా దేకింది. నా అవసరంబట్టే తీసుకోక తప్పిందికాదు. అది తెలుసుకున్న ఆ స్నేహితుడు నెలాఖరుకు మళ్లీ జీతంలో రూపాయికింతఅని వడ్డీ పట్టుకొనేవాడు. నెలారెణ్ణెల్లు నా దగ్గర వడ్డీ పుచ్చుకో వచ్చాడా అనే నమ్రకంతో చేబదుళ్లు పెంచాను. చివరకు వడ్డీతోనే యిచ్చుకున్నాను. నాకు అతనికీ నెమ్మదిమీద స్నేహబంధం పోయి వ్యాపార సంబంధం యేర్పడింది... ఏ పదోతారీఖునో వచ్చింది కొస్తా అయిపోయి అడిగితే ఫస్టుకు జీతం వచ్చినప్పుడు వడ్డీతోసహా యిచ్చింది కక్కించేశాడు. వచ్చిన జీతంలో యిదిపోతే బతికేదేముంది? మళ్లీ చచ్చినట్టు వాడిదగ్గిరే మరో నాలుగు రోజులకు అప్పు తీసుకోవలసి వచ్చేది. ఈ యిచ్చి పుచ్చుకోడాలు మిగలమగ్గడంతో అతన్ని కాదని యింకోళ్లదగ్గరికి పోయే తాహతు లేకపోయింది నాకు...'

మళ్ళీ పెదిమలు తడుపుకుంటున్నాడు.

'పాడుఖర్చు యిదొకటి, మానెయ్యరాదూ?' అన్నాను యింకో సిగరెట్టు వాడినోటి కందిస్తూ.

'గుండె లెండిపోయినా సరే, నాకు క్షయ వచ్చినాసరే మానెయ్యను. నేను అప్పుల కెంత దాసుణ్ణో యీ సిగరెట్టు క్కూడా అంత దాసుణ్ణేను'

వాడు డెస్పరేట్ మూడ్‌లో నా దగ్గరి కొచ్చాడనిపించింది. 'అసలెందు కప్పుచేశావురా?'—అప్పుడు చూశాడు వాడు నా వంకకు.

'ఇలా అడుగుతావను కుంటే నీదగ్గరి కొచ్చేవాణ్ని కాదు. నేను బతుకుతున్న ప్రపంచంలో నువ్వు బతకడంలా? మా బావమరిది పెళ్లిలో చదివింపులకోసం అప్పు చేశాను. చదివించకపోతే అందరి బావల ముందు నా పెళ్లాం చిన్నపోవాల్సి వస్తుందని, అందరు అల్లుళ్ళముందు నేను లోకువ కావాల్సి వస్తుందని—పెళ్లినుంచి తిరిగొచ్చిందో లేదో నా పెళ్లాం జబ్బపడింది. నా స్తోమతమీద అనుమానం కలిగి యిక యివ్వనన్నాడు ఆఫీసు అప్పులస్నేహితుడు. నా పెళ్లాన్ని డాక్టరుకు చూపించాలంటావా వద్దంటావా? నామీద గౌరవమున్న ఎదురింటి ఆయనదగ్గర పదిరూపాయలు తీసుకొని డాక్టర్ ఎగ్జామినేషన్ చేయించాను. ఇంజక్షన్లు తెచ్చుకోమన్నాడు. పొద్దున్నే పుచ్చుకొని మళ్ళీ సాయంత్రమే అతణ్ని ఏమని అడిగేది? ఆ సాయింత్రం ఇంకో ఎరుగున్న వ్యక్తిని ఆప్యాయంగా పలకరించాను. నా డబ్బుతోనే సినిమాకు తీసుకువెళ్లి మర్నాడు యిరవై రూపాయలు ముక్కించాను...'

చెబుతుంటే వాడికి విచారంతో బాబు నవ్వుకూడా వస్తోంది.

'ఈ అప్పులు చేసిన మూడోరోజుకి పాపాయికి ఒళ్లు తెలియని జ్వరం వచ్చింది. వారంరోజులు మొండికేశాను. డాక్టరొకరోజు నా పెళ్లాన్ని చూడడాని కొచ్చి పాపాయిజ్వరం టైఫాయిడ్‌లోకి దిగిందన్నాడు. మళ్ళీ ఎవరినెత్తినన్నా చెయ్యిపెట్టాలంటావా అక్కర్లేదంటావా?'

'నెల నెలా వచ్చే జీతమేంచేశావ్?'

'ప్రెస్ రిపోర్టరులా ప్రశ్నలు వెయ్యకురా. గుండెలున్నవాడివర్థం చేసుకోలేవూ? రోగాల్ని మ్రింగుతుంటే ఆకలిపోతుందిట్రా? సంసారం చేస్తున్నవాడివి


ప్రపంచ ప్రఖ్యాత మద్రాసు నశ్యం

★ నాణ్యతయే దానిఘనత ★



★ ఒకసారి కొంటే తిరిగి వదలిపెట్టరు ★

నశ్యములలో ఉత్తమమైనది పట్నం నశ్యమే. కాని అత్యుత్తమమైనది, అందరూ కోరునది, కారం, నాణ్యత, సువాసన గలది. అప్పాదురై నశ్యమే.

అ. అప్పాదురై ముదలియార్ & సన్స్

ఆచారప్పన్ వీధి, పోస్టుబాక్సు నెం. 189, మద్రాసు-1.

నీకు యింటిఖర్చులు తెలియవని అనుకో లేను. పైగా ఆరునెల్ల అద్దెబాకీ ఉన్నాను గనుక లేచిపొమ్మని యింటివాడు నోటీసు కూడా యిచ్చాడు. ఇదిగో అది జేబులోనే ఉంది. ఇప్పుడు నే నెక్కడుంటానో వాడంతు కనుక్కోలేడనుకో' అని నవ్వ బోతున్నట్లు పెదిమలు వెడల్పు చేశాడు గాని వెంకట్రామునికి నవ్వురాలా.

'జ్వరం పాపాయికి బత్తాయిలు... జబ్బు పెళ్లానికి యింజక్షనులు...మందుల కోసం తిరిగి ఆఫీసు కట్టల్లో మెదడు దూర్చి విసుగుపడి యింటికొచ్చి వండుకు తినిలేక కొన్ని పూటలు హోటల్లో తిన్నాను. ఎంత ఖర్చయ్యేదీ నీకు తెలియకపోదు. బహుశా హోటలుకు పెట్టిన డబ్బు అనవసరంగా పెట్టానని మందలిస్తావేమో—'

నాకుమాత్రం ఏమనడానికీ నోరురాలా.

'ఎంత ఎంగిలి విస్తర్లు నాకే ప్రాణి కయినా స్నేహితులంటూ తప్పరురా. జేబు ఖాళీగా ఉంచుకొని ఎన్నిసార్లు స్నేహితుల వెంబడి తిరగను? ఏ నాగరకత కోసమో ఏ అవసరం కోసమో ఎన్నిసార్లు వాళ్ల డబ్బుతో టిఫిన్లు చెయ్యమంటావ్? ఇదివరకు అడగనివాళ్ని అడిగి రూపాయి అర్థ తీసుకొని కొన్నిసార్లు కొందరు స్నేహితుల్ని—నేనూ వాళ్ల స్నేహితుణ్నేనని ఋజువు చేసుకోడానికి—హోటళ్లకు తీసుకెళ్లాను. ఒకసారి ఏమీ తోచక మనసు చికాగ్గా ఉంటే ఓ కథలాగా నీకు ఉత్తరం రాశాను జ్ఞాపకముందా—ఆరోజున—రాసిన ఉత్తరం పోస్టు చెయ్యడానికి జేబు ఖాళీగా ఉంది. లెటర్ బాక్సుదాకా వచ్చి పేవుమెంట్‌మీద కనబడిన ఓ తెలిసిన పెద్ద మనిషిని బేడా అడిగి తీసుకొని కవరుకొని నీకు పోస్టుచేశా. ఆ ఉత్తరం రాయకపోతే యే దేముడేడ్చాడంటావు నువ్వు, ఇంతేగా...'

'.........

'నా ఆర్థిక పురాణం వంథోమ్మిదో పురాణంరా. నేను జోక్సు, కట్‌చేస్తున్నాననుకోకు. లోపలి వేదన జ్ఞాపకంరాకుండా ఎవరితో మాట్లాడినా లైట్‌గా మాట్లాడడం నేర్చుకున్నాను. ఆఫీసుకు వెళ్ళడానికి బస్సు ఊళ్ళో ఎవ్వరూ ఎక్కనివ్వరు. మా రెండోవాడు ఆడుకోడానికని విడుస్తుంటే ఏం కొనిపెట్ట గలను గనుక—అందుకని దండగుచ్చి గలగల లాడించుకుంటాడని అప్పుడు అప్పుడు ఖర్చు మిగుల్చుకొని చిల్లి కానీలు చేసి వాడికిస్తూ వచ్చేవాణ్ని. నా పెళ్లాన్నడిగి అవి కూడా తీసుకొని బస్సెక్కి ఓ రోజు ఆఫీసుకెళ్లాను. తిరిగి వచ్చేందుకు లేకపోతే మా పెద్దమ్మాయి మరిది యింటిదాకా నడిచివెళ్లి అతనితో అరగంట, గప్పాలుకొట్టి పర్సు పోయిందని అబద్ధమాడి అయిదురూపాయలు సంపాయించాను.'

సిగరెట్టుకోసం యీమాటు వాడే చెయ్యి చాచాడు. కొత్త ఆసరా దొరికిన వ్యక్తి దగ్గరనుండి ఎంత రాబట్టాలో అంతా రాబట్టగలిగే ప్రవృత్తి వెంకట్రాముడి కబ్బినట్లు చాచినచెయ్యి వినబడకుండా చెప్పింది.

'ఇన్ని అప్పులూ చేసి యిప్పుడు ఉద్యోగంకూడా ఎందు కొదులుకున్నావురా?'

'ఒరే, విసుక్కోకు. నేను నాకే విసుగ్గా ఉన్నప్పుడు నీ విసుగు నామీద పనిచెయ్యదు. సంవత్సరంలో ఋతువు లెట్లాగో రోగాలుకూడా అంతే. వండుకుతింటూ, డాక్టరు దగ్గరికి పరుగెడుతూ, పాపాయిల్ని సముదాయిస్తూ ఆఫీసుకు టైముకెట్లా వెళ్తాను? ఎన్ని బ్లాక్‌మార్కులు పడ్డాయో ఎన్ని వార్నింగ్ చీటీలు పర్సనల్ ఫైలులో నెక్కాయో యిప్పుడెందుకు? నా సెలవు దరఖాస్తు నెవరు తీసుకెళ్లి యిస్తారు? ఇక నేను వెళ్లి యిచ్చిరావాలి. బస్సులకు పెట్టే డబ్బుతో బత్తాయిలు తెచ్చి పెళ్లానికి రసం తీసి యివ్వొచ్చు. మరి సెలవు లేకుండా యింటిదగ్గర కూచుంటే మెడికల్ సర్టిఫికెట్ కావద్దూట్రా? దొంగ సర్టిఫికెట్‌కు ప్రాక్టీసు లేని డాక్టర్లు ఎంత ఛార్జి చేసేదీ నీకు తెలుసు. పెళ్లానికి మందిచ్చిన డాక్టరుకు దమ్మిడీ యివ్వలే దిప్పటికి. ఇంకా నాచేత ఎందుకు చెప్పిస్తావురా—'

చెవు లప్పగించి వింటున్నాను.

'పెళ్లాన్ని పోషించాల్సిన బాధ్యత కొద్ది రోజుల్లో తీరిపోతుంది—'

'అదేమిటి వెంకట్రాముడూ?' అప్పటికి వెంకట్రాముడు కళ్ళల్లోకి నీళ్లు తిరిగాయి.

'నా పెళ్లానికి టి. బి. పెరిగింది. డబ్బు కట్టలేని వాడికి గోల్డ్ యింజక్షన్లు గ్యాస్ యింజక్షన్లు ఎవరిస్తారు? శానిటోరియంలో ఎవరు చేర్చుకుంటారు? కొన్నాళ్ళకది చచ్చిపోక పోతుంది?' నా కాళ్ళమీద తలకాయపెట్టి వెంకట్రాముడు ముఖం మూసుకున్నాడు.

వినపడీ వినపడకుండా ఏడ్వాలేద న్నాను.

'నా పిల్లల్ని నువ్వు పెంచరా... నేను మళ్ళీ ఎప్పుడో వచ్చి నా పిల్లల్ని తీసుకెళ్తాను, తప్పదు. ఎరుగున్న వాళ్ళందర్ని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యడం నా హక్కు. ఎరగని వాళ్ళనుకూడా ఎక్స్‌ప్లాయిట్ చెయ్యడం నా ఆర్టు. ఈ డ్రయివ్‌లో ఎవ్వర్నీ వదలను. నిన్నుకూడా ఎక్స్‌ప్లాయిట్ చేస్తాను. నేను తీసుకెళ్ళేదాకా నా పిల్లల్ని పెంచు—' అని భోరుమన్నాడు వెంకట్రాముడు.

'కొత్త ఉద్యోగంలో చేరుతున్నాను—ఎక్స్‌ప్లాయిటేషన్'.........

మర్నాడు సాయంత్రం యింటికి వచ్చేప్పటికి 'బాబాయి' అంటూ ఒక్క మోహాల్లో వెంకట్రాముడి యిద్దరు పిల్లలూ నా కాళ్లు చుట్టేశారు. ★




చదవండి / తెనుగు మాస పత్రిక
జయభారత్